సాక్షి
పల్నాడు
బుధవారం । 18 । డిసెంబర్ । 2024




గోదాదేవికి సారె

మంగళగిరి: ఆత్మకూరు బాపూజీ విద్యాలయ ఆవరణలో జరుగుతున్న ధనుర్మాసోత్సవాల్లో భాగంగా మంగళవారం గోదాదేవికి భక్తులు సారె సమర్పించారు.



ధనుర్మాస పూజలు

వినుకొండ(నూజెండ్ల): ధనుర్మాస ప్రారంభం సందర్భంగా పట్టణంలోని పాత మార్కెట్ వద్ద ఉన్న పురాతన కోదండ రామస్వామి గుడిలో మంగళవారం పూజలు చేశారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం మంగళవారం 579.50 అడుగుల వద్ద ఉంది. కుడి కాలువకు 7,086 క్యూసెక్కులు విడుదలవుతోంది.

రైతుల పెడబొబ్బర!



ఈ ఫొటోలో కనిపిస్తున్న రైతు పేరు సుంకర వెంకటేశ్వర్లు, ఊరు వెల్దుర్తి మండలం మండాది. ఎనిమిది ఎకరాల్లో మిర్చి సాగు చేశాడు. సుమారు రూ.11 లక్షలు ఖర్చు చేశాడు. పూత దశ దాటాక బొబ్బర తెగులు సోకడంతో ఆకులు ముడుచుకుపోయి పూత, పిందె రాలిపోయాయి. దిగుబడి బాగా తగ్గిపోయింది. వచ్చిన అరకొర మిర్చి దిగుబడిని కూలీలతో తీసి అమ్ముదామంటే మార్కెట్‌లో ధర అమాంతరం పడిపోయింది. కూలీల ఖర్చులకూ సరిపోని దుస్థితి. ఎకరానికి రూ.1.4 లక్షల చొప్పున పెట్టిన పెట్టుబడి మొత్తం పోయిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు.
– ఇలా వెల్దుర్తి, దుర్గి, మాచర్ల, కారంపూడి, గురజాల మండలాల్లో అనేక మంది రైతులు బొబ్బర తెగులుతో నష్టపోయి విలవిల్లాడుతున్నారు.



- మిరప రైతును ముంచిన తెగులు
- పూత దశలో విజృంభించిన బొబ్బర తెగులు
- భారీగా తగ్గిన దిగుబడి
- మందులు వాడినా ఫలితం శూన్యం
- ఎకరాకు రూ.లక్షపైనే నష్టం
- దిగజారిన ధరలతో మరిన్ని అవస్థలు
- పల్నాడు జిల్లాలో ఖరీఫ్‌లో 39,609 హెక్టార్లలో సాగు

సాక్షి, నరసరావుపేట: మిర్చి రైతు పాలిట బొబ్బర తెగులు మహమ్మారిలా దాపురించింది. రూ.లక్షలు ఖర్చు చేసి సాగు చేసిన పంట కళ్లముందే రోజురోజుకు క్షీణించడంతో కర్షకులు దిగాలు పడుతున్నారు. మబ్బులతో కూడిన చల్లని వాతావరణం ఉండటంతో మిర్చికి పురుగు, తెగుళ్ల బెడద అధికమైందని రైతులు భావిస్తున్నారు. పంట దిగుబడి భారీగా పడిపోతోందని చెబుతున్నారు. ఇప్పటికే మార్కెట్‌లో మిర్చి ధరలు భారీగా పతనమైన సమయంలో దిగుబడి పడిపోవడంతో రైతుల పరిస్థితి దయనీయంగా మారింది. ఇదిలా ఉంటే బొబ్బర తెగులుకు క్రాప్ ఇన్సూరెన్సు వర్తించే అవకాశం లేకపోవడంతో ప్రభుత్వమే తమను ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు. ఈ ఖరీఫ్‌లో పల్నాడు జిల్లాలోని రైతులు 36,609 హెక్టార్లలో మిర్చి పంటను సాగు చేశారు.



బొబ్బర తెగులు సోకిన మిర్చి పంట

పూత పిందె రావడం లేదు..

మిర్చి పంటకు మిగిలిన పంటలతో పోలిస్తే పెట్టుబడి ఎక్కువ. దిగుబడి, ధర బాగుంటే అధిక లాభాలు వస్తాయన్న ఆశతో రైతులు అప్పులు చేసి మరీ ఖర్చు చేస్తారు. ఎరువులు, పురుగుమందుల వాడకం ఎక్కువ కావడంతో ప్రస్తుతం ఎకరా మిర్చి పంటకు రూ.లక్ష నుంచి రూ.లక్షన్నర వరకు పెట్టుబడి అవుతోంది. కౌలు రైతులైతే భూమి కౌలుకు మరో రూ.20వేల నుంచి రూ.30 వేలు అధికంగా వెచ్చిస్తారు. ఇంతమొత్తం పెట్టుబడి పెట్టి సాగు చేస్తే తీరా పంట చేతికొచ్చే సమయంలో బొబ్బర తెగులు పంటను తుడిచిపెట్టేస్తోంది. ఆకులు మడతపడిపోతున్నాయి. మొక్క ఎదుగుదల ఆగిపోయింది. ఇప్పటికే ఉన్న పూత, పిందెలు అర్ధతరంగా రాలిపోతున్నాయి. మిర్చి సాధారణ దిగుబడి 30 క్వింటాళ్ల వరకు ఉండగా బొబ్బర వచ్చిన తోటల్లో ప్రస్తుతం 10 క్వింటాళ్లు కూడా రావడం కష్టమని రైతులు చెబుతున్నారు. గతంలో మిర్చి ధర క్వింటాలుకు రూ.20 వేలకుపైగా ఉండగా ప్రస్తుతం రూ.14 వేలు మాత్రమే పలుకుతోంది. దీంతో పండిన అరకొర మిర్చిని కూలీలతో తీసి విక్రయిస్తే కనీసం కూలీ, రవాణా ఖర్చులూ రావని రైతులు ఆక్రోశిస్తున్నారు. దీంతో కొంతమంది పంటను అలాగే వదిలేస్తున్నారు.

సంక్షోభంలో మిర్చి రైతులు



నేను 10 ఎకరాల్లో మిర్చి పంట సాగు చేశా. బొబ్బర తెగులు సోకి పంట దిగుబడి బాగా తగ్గింది. మరో వైపు ధర అమాంతం పడిపోవడంతో దిక్కు తోచడం లేదు. గత సీజన్‌లో పండిన 250 క్వింటాళ్ల మిర్చిని అధిక ధర వస్తుందని కోల్డ్ స్టోరేజ్‌లో భద్రపరిచా. అప్పట్లో తేజా రకం ధర రూ.18 వేలు ఉండగా ఇప్పుడు అది రూ.14వేలకు పడిపోయింది. ఇన్ని రోజులు దాచిన తరువాత ఉన్న ధర రూ.4వేల నుంచి రూ.6 వేలు పడిపోతే ఎంత నష్టమో అర్థం చేసుకోండి. మిర్చి రైతులు సంక్షోభంలో ఉన్నారు.

– కామిరెడ్డి లింగారెడ్డి, మండాది, వెల్దుర్తి మండలం

రూ.లక్షల్లో పెట్టుబడి పెట్టా



నేను ఆరు ఎకరాల్లో మిర్చి పంట సాగు చేశా. బొబ్బర తెగులు వల్ల పంట తీవ్రంగా దెబ్బతింది. కనీస దిగుబడి వచ్చేలా కనిపించడం లేదు. ఇప్పటికే ఎకరాకు రూ.లక్షకుపైగా పెట్టుబడి పెట్టాం. దీంతో ఈ ఏడాది తీవ్రంగా నష్టపోనున్నాం.

– వెన్నపూసల జగన్‌మోహన్‌రెడ్డి, కాచవరం, కారంపూడి మండలం

వైభవంగా ఆరుద్రోత్సవం

త్రికోటేశ్వరునికి మహారుద్రాభిషేకం



నరసరావుపేట రూరల్: కోటప్పకొండలో ఆరుద్రోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. సోమవారం అర్ధరాత్రి 12 గంటల నుంచి ప్రారంభమైన కార్యక్రమంలో త్రికోటేశ్వర స్వామికి మహాన్యాసపూర్వక మహారుద్రాభిషేకాన్ని శాస్త్రోక్తంగా జరిపారు. అభిషేకాలు నిర్వహించారు. చివరగా అన్నాభిషేకం జరిపిన అనంతరం స్వామికి విశేష పుష్పాలంకరణ చేశారు. తెల్లవారుజాము వరకు జరిగిన అభిషేకాలను తిలకించేందుకు భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. భక్తుల సౌలభ్యం కోసం త్రిముఖ శివలింగం వద్ద స్క్రీన్ ఏర్పాటు చేశారు. అర్ధరాత్రి 12 గంటల సమయంలో కోటయ్య మాలధారులకు జ్యోతి దర్శనం కల్పించారు. పాతకోటయ్య స్వామి ఆలయం వద్ద వెలిగించిన జ్యోతిని భక్తులు దర్శించుకున్నారు. జ్యోతి దర్శనంలో ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు, ఆలయ ట్రస్టీ రామకృష్ణ కొండలరావు పాల్గొన్నారు. అనంతరం ఎమ్మెల్యే స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ఈఓ డి.చంద్రశేఖరరావు ఏర్పాట్లు పర్యవేక్షించారు. ఆరుద్రోత్సవానికి హాజరైన భక్తులకు దాతల సహకారంతో అన్న సంతర్పణ చేశారు. మంగళవారం ఉదయం ఆలయ యాగశాలలో గణపతి హోమం, రుద్ర హోమం, శాంతి హోమం, వాస్తు హోమం, పూర్ణాహుతి నిర్వహించారు.

న్యూస్‌రీల్

ఉపాధి పనులలో నిర్లక్ష్యం తగదు



మాచర్ల రూరల్: మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం నిర్మాణ పనులను నిర్ణీత సమయంలో పూర్తి చేసేలా అధికారులందరూ సమష్టిగా పనిచేయాలని పల్నాడు జిల్లా ఏపీడీ కొరటా మల్లికార్జునరావు కోరారు. మంగళవారం మండలంలోని కొత్తపల్లి, కొప్పునూరు, తాళ్ళపల్లి, చింతలతండ, నాగులవరం గ్రామాలలో మినీ గోకులం షెడ్ల నిర్మాణ పనులను ఆయన పరిశీలించి మాట్లాడారు. డివిజన్‌లో మినీ గోకులం షెడ్ల నిర్మాణం కోసం తలపెట్టిన పనులను వేగంగా పూర్తి చేయాలని, ప్రతి ఒక్కరికీ పని కల్పించేలా ఉపాధి హామీ పనులు కల్పించాలని కోరారు. గ్రామాల అభివృద్ధిలో ఉపాధి హామీ పథకం కీలకమైందని, ఈ పనుల నిర్వహణలో అలసత్వం ప్రదర్శించవద్దని, నిర్ణీత సమయంలో పనులు పూర్తి చేసి జవాబుదారీగా ఉండాలని ఆదేశించారు. ఆయన వెంట ఏపీఓ శ్రీనివాసరావు, టెక్నికల్ అసిస్టెంట్ గోవిందు, ఇంజినీర్ గోపి, ఫీల్డ్ అసిస్టెంటు మరియదాసు, నాయకులు ఉన్నారు.

ఎట్టకేలకు రైతును కలిసిన ఉప ముఖ్యమంత్రి

మంగళగిరి: ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌ను కలిసి అన్నదాతల సమస్యలు విన్నవించేందుకు అనంతపురం జిల్లా హిందూపురం నుంచి వచ్చిన రైతు నవీన్‌కుమార్‌కు ఎట్టకేలకు పవన్ కళ్యాణ్ దర్శనమిచ్చారు. సాక్షి దినపత్రికలో మంగళవారం 'సమస్యలు పరిష్కరించాలి ఎడ్ల బండి కట్టి' అంటూ ప్రచురితమైన కథనానికి స్పందించిన ఉప ముఖ్యమంత్రి మంగళవారం ఉదయం నవీన్‌కుమార్‌ను కలిశారు. అనంతరం నవీన్ కుమార్ మాట్లాడుతూ.. దళారుల బెడద తప్పించాలని, పంటకు గిట్టుబాటు ధర కల్పించి మార్కెట్‌లో విక్రయించుకునేలా చూడాలని కోరారు. వినతిపత్రాన్ని కార్యాలయంలో ఇవ్వాలని తెలపగా, ఆ మేరకు అందజేసినట్లు తెలిపారు.

ఎన్‌సీసీ కోటాలో అగ్రిసెట్ ప్రవేశాలకు కౌన్సెలింగ్



గుంటూరు రూరల్: ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోని కళాశాలల్లో ప్రస్తుత విద్యాసంవత్సరానికి బీఎస్సీ అగ్రికల్చర్ కోర్సుల్లో ఎన్‌సీసీ కోటాలో అగ్రిసెట్ 2024 ద్వారా ప్రవేశాలకు కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. ఈ మేరకు విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ జి.రామచంద్రరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 19వ తేదీన కౌన్సెలింగ్ ఉంటుందని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు విశ్వవిద్యాలయం వెబ్‌సైట్ ఏఎన్‌జీఆర్‌ఏయూ.ఏసీ.ఇన్‌ను సంప్రదించాలన్నారు.

18 నుంచి లెవెల్ క్రాసింగ్ గేటు మూసివేత



లక్ష్మీపురం: మంగళగిరి నుంచి నిడమర్రు వరకు రోడ్డు నిర్మాణ పనుల నేపథ్యంలో మూడు రోజుల పాటు నంబూరు–మంగళగిరి మధ్య లెవెల్ క్రాసింగ్ గేటును మూసి వేయనున్నట్లు డివిజన్ సీనియర్ డీసీఎం ప్రదీప్‌కుమార్ మంగళవారం తెలిపారు. ఈ నెల 18 నుంచి 20వ తేదీ వరకు లెవెల్ క్రాసింగ్ గేటు మూసి వేయడం వల్ల ట్రాఫిక్‌ను డాన్ బాస్కో స్కూల్– నవలూరు సెంటర్ – క్రికెట్ స్టేడియం రోడ్డు –నిడమర్రు మీదుగా మళ్లించనున్నట్లు పేర్కొన్నారు.

ప్రకృతి వ్యవసాయ క్షేత్రాల పరిశీలన

వేటపాలెం: బాపట్ల జిల్లాలో సాగు చేస్తున్న ప్రకృతి వ్యవసాయ విధానాన్ని గుజరాత్, మధ్యప్రదేశ్, బీహార్ రాష్ట్రాల్లో ఆగాఖాన్ రూరల్ సపోర్ట్ ప్రోగ్రామ్‌కు చెందిన 13 మంది సభ్యుల బృందం వేటపాలెం మండలానికి మంగళవారం వచ్చింది. వీరికి స్థానిక రైతు సేవా కేంద్రం వద్ద ప్రకృతి వ్యవసాయంలో నిర్వహిస్తున్న తొమ్మిది సూత్రాలు, తయారీ వాడకం గురించి వ్యవసాయ అధికారులు చేసి చూపి అవగాహన కల్పించారు. అనంతరం పందిళ్లపల్లిలో ప్రకృతి వ్యవసాయం ద్వారా తొమ్మిది మంది రైతులు 13 ఎకరాల్లో సాగు చేస్తున్న దేశవాళీ వరి పంటలను సందర్శించారు. ఉపయోగాలు తెలుసుకున్నారు.

తోబుట్టువే తోడేలై



కేసు వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ ఎం.హనుమంతరావు, చిత్రంలో సీఐ సుబ్బారావు, ఎస్ఐ సురేష్

- డబ్బు కోసమే సోదరుల హత్య
- దర్యాప్తులో తేల్చిన పోలీసులు
- ఆరుగురు నిందితుల అరెస్టు

నకరికల్లు: తోబుట్టువే తోడేలైంది. డబ్బుపై వ్యామోహంతో రక్తసంబంధాన్ని మరిచి సొంత సోదరులను పథకం ప్రకారం హతమార్చింది. మృతుల్లో ఒకరు కానిస్టేబుల్ కావడం, అతను విధులకు హాజరుకాకపోవడంతో దర్యాప్తు చేపట్టిన పోలీసులు కేసు మిస్టరీని ఛేదించారు. సొంత సోదరే అన్న, తమ్ముడిని చంపిందని తేల్చారు. ఆరుగురు నిందితులను అరెస్టు చేశారు. నకరికల్లులో కలకలం రేపిన ఈ కేసు వివరాలను డీఎస్పీ ఎం.హనుమంతరావు మంగళవారం విలేకరుల సమావేశంలో వెల్లడించారు. ఆయన కథనం ప్రకారం.. నకరికల్లుకు చెందిన గిరిజన పాఠశాల ఉపాధ్యాయుడు తలపాల పౌలురాజు అనారోగ్యంతో ఇటీవల మృతిచెందాడు. ఆయనకు ముగ్గురు సంతానం. గోపీకృష్ణ పెద్ద కొడుకు. రెండో సంతానం కృష్ణవేణి. దుర్గారామకృష్ణ చిన్నకొడుకు. కృష్ణవేణికి పెళ్లయి కూతురు ఉంది. భర్తను వదిలి పుట్టింట్లోనే ఉంటుంది. గోపీకృష్ణ, దుర్గారామకృష్ణ కూడా భార్యలతో విడిపోయారు. ఈ క్రమంలో తండ్రి మరణంతో ప్రభుత్వం నుంచి వచ్చే రూ.70 లక్షలు తనకే చెందాలని కృష్ణవేణి డిమాండ్ చేసింది. దీనికి గోపీకృష్ణ, దుర్గారామకృష్ణ అంగీకరించలేదు. దీంతో ఘర్షణ పడుతూ వచ్చారు. అన్న, తమ్ముడి అడ్డు తొలగించుకుంటే డబ్బుతోపాటు తండ్రి వారసత్వంగా ఉద్యోగం వస్తుందని అత్యాశకు పోయిన కృష్ణవేణి సోదరుల హత్యకు పథకం రూపొందించింది.

సహజీవనం చేస్తున్న వ్యక్తి సహకారంతో..

రెండేళ్లుగా తనతో సహజీవనం చేస్తున్న మల్లా దానయ్య సహకారంతో స్థానికంగా ఉండే ఇద్దరు మైనర్లతో కలిసి కృష్ణవేణి నవంబర్ 26న తమ్ముడు దుర్గా రామకృష్ణను చంపేందుకు ప్రణాళిక వేసింది. మైనర్ యువకులకు చెరొక రూ.10వేలు ఇస్తానని బేరం కుదుర్చుకుంది. అదేరోజు రాత్రి 10 గంటల సమయంలో దుర్గారామకృష్ణకు మద్యం తాగించి చున్నీతో గొంతు బిగించి చంపారు. తర్వాత దానయ్య మోటారు సైకిల్‌పై దుర్గారామకృష్ణ మృతదేహాన్ని మైనర్లు తీసుకెళ్లి అక్షరస్కూల్ వద్ద గోరంట్ల కాలువలో పడేశారు.

వైరు తెగినా.. ఆగక..

తమ్ముడిని హత్య చేసిన 14 రోజుల అనంతరం ఈనెల 10న రాత్రి కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న అన్న గోపీకృష్ణ హత్యకు కృష్ణవేణి మరో ఇద్దరు మైనర్లతో కలిసి పథకం వేసింది. చెరో రూ.పది వేలు ఇస్తానని బేరం కుదుర్చుకుంది. అన్న గోపీకృష్ణకు కూడా మద్యం తాగించి మెడకు వైరు బిగించింది. వైరు తెగినా ఆగకుండా చున్నీతో మెడను బిగించి ఊపిరాడకుండా చేసింది. చనిపోయాడని నిర్ధారించుకున్నాక దానయ్య మోటార్‌సైకిల్‌పై మృతదేహాన్ని తీసుకెళ్లి గుంటూరు బ్రాంచి కెనాల్‌లో మైనర్లు పడేశారు.

నేరాంగీకారం

హత్యలు చేసింది తానేనని నిందితురాలు ఒప్పుకోవడంతో ఆమెకు సహకరించిన నలుగురు మైనర్లతోపాటు కృష్ణవేణి, దానయ్యలను పోలీసులు అరెస్టు చేశారు. వీరిని కోర్టుకు హాజరుపర్చినట్లు డీఎస్పీ తెలిపారు. కార్యక్రమంలో సత్తెనపల్లి రూరల్ సీఐ సుబ్బారావు, ఎస్ఐ సురేష్ పాల్గొన్నారు.

నిబంధనలకు 'నీళ్లు'

- ఏకపక్షంగా డీసీ ఎన్నికలు
- తూతూమంత్రంగా ప్రక్రియ
- టీడీపీ ఎమ్మెల్యేలదే నిర్ణయాధికారం
- అక్కడక్కడ జనసేనకు ప్రాతినిధ్యం

నరసరావుపేట: సాగునీటి సంఘాల్లో భాగమైన డిస్ట్రిబ్యూటరీ కమిటీ(డీసీ)ల ఎన్నికలు మంగళవారం ఏకపక్షంగా జరిగాయి. ప్రధాన ప్రతిపక్షం వైఎస్సార్ సీపీ ఈ ఎన్నికలకు దూరంగా ఉండటంతో అధ్యక్ష, ఉపాధ్యక్ష పదవులను చాలా చోట్ల టీడీపీ, జనసేన నాయకులు పంచుకున్నారు. ఎన్నికల నిబంధనలకు నీళ్లొదిలారు. ఎమ్మెల్యేలు సూచించిన వారికే పదవులు లభించాయి. నియోజకవర్గ కేంద్రాల్లోనే పోలింగ్ నిర్వహించారు. గత శనివారం జరిగిన వాటర్ యూజర్ అసోసియేషన్(డబ్ల్యూయూఏ) ఎన్నికలతోనే మొత్తం ఎన్నికల ప్రక్రియను అధికార కూటమి ప్రభుత్వం అపహాస్యం చేసిందనే విషయం తేటతెల్లమైంది. ప్రతిపక్షాలకు ఓటరు జాబితాలు ఇవ్వకపోవటం, కనీసం ఎన్నిక జరుగుతున్న గ్రామాల్లోని ప్రజలకూ ఎన్నికలు ఉన్నాయనే విషయం తెలియకుండా నిర్వహించడం విస్తుగొలిపింది. ముందుగానే నిర్ణయించుకున్న పేర్లను అధ్యక్ష, ఉపాధ్యక్షులుగా టెరిటోరియల్ క్యాండిడేట్లు(టీసీ)గా ఎన్నికైన వారు ఎన్నుకున్నారు. డబ్ల్యూయూఏ ఎన్నికల్లో జిల్లా వ్యాప్తంగా జనసేనకు ప్రాతినిధ్యం కల్పించలేదనే విమర్శలు వెల్లువెత్తడంతో పెదకూరపాడు నియోజకవర్గం అమరావతి డీసీ అధ్యక్ష పదవిని కమ్మ సామాజికవర్గానికి, ఉపాధ్యక్ష పదవిని కాపు సామాజికవర్గానికి కట్టబెట్టారు. నరసరావుపేట నియోజకవర్గంలో రెండు డీసీల వైస్ చైర్మన్ పదవులను జనసేనకు కేటాయించారు. నాగార్జునసాగర్ కుడికాలువ పరిధిలో 32 డీసీలు ఉండగా, గుంటూరు జిల్లాలో ఐదు, ప్రకాశం జిల్లాలో రెండు ఉన్నాయి. వీటిలో పల్నాడు జిల్లాలో ఉన్న 25 డీసీలైన మాచర్ల, గురజాల, కారంపూడి, చామర్రు, నకరికల్లు, ముప్పాళ్ళ, సత్తెనపల్లి, తంగెడ, బెల్లంకొండ, క్రోసూరు, కేసానుపల్లి, పిడుగురాళ్ల, పెదకూరపాడు, అమరావతి, ఫిరంగిపురం, లింగంగుంట్ల, చిలకలూరిపేట1, 2, రొంపిచర్ల, గంటావారిపాలెం, వినుకొండ, చీకటీగెలవారిపాలెం, ఐనవోలు, త్రిపురాపురం, ములకలూరుకు ఎన్నికలు నిర్వహించారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయని జిల్లా నోడల్ అధికారి, ఎన్ఎస్పీ ఎగ్జిక్యూటీవ్ ఇంజినీర్ మురళీధర్ పేర్కొన్నారు. జిల్లాలో 219 మేజర్, 55 మైనర్ కలిపి మొత్తం 274 సాగునీటి ఎన్నికలకు గత బుధవారం నోటిఫికేషన్ విడుదలైన విషయం తెలిసిందే



డీసీ–19కు వైస్ చైర్మన్‌గా ఎన్నికైన శేషయ్యను అభినందిస్తున్న జనసేన నాయకుడు సయ్యద్ జిలాని

మళ్లీ చేతివాటం చూపిన చైన్ స్నాచర్లు



తాడేపల్లి రూరల్: రాష్ట్రపతి మంగళగిరికి రావడంతో విజయవాడ – గుంటూరు మార్గంలో మంగళవారం బందోబస్తుకు పోలీసులు వెళ్లారు. ఈ హడావుడిలో ఉన్న పోలీసులను గమనించిన చైన్ స్నాచర్లు మంగళవారం నిమిషాల వ్యవధిలో రెండు ప్రాంతాల్లో మహిళల మెడలోని బంగారు చైన్‌లు లాక్కొని పల్సర్ బైక్‌పై పరారయ్యారు. సేకరించిన వివరాల ప్రకారం... తాడేపల్లి వైఎస్సార్ సెంటర్ (కొత్తూరు) ఆంజనేయస్వామి గుడి సమీపంలో నివాసముండే దొంతిరెడ్డి సుగుణ (60) రోడ్డుపై నడుచుకుంటూ వెళుతున్నారు. ఇద్దరు యువకులు పల్సర్ బైక్‌పై వచ్చి ఆమె మెడలోని నాలుగు సవర్ల బంగారపు నానుతాడును తెంచుకు వెళ్లారు. ఈ ఘటన ఉదయం 8.30 నిమిషాలకు జరిగింది. 8.58 నిమిషాలకు కుంచనపల్లి బైపాస్‌రోడ్‌లోని ఆంధ్రరత్న పంపింగ్ స్కీం రోడ్డులో బైపాస్ వైపు నడుచుకుంటూ వెళుతున్న స్రవంతి మెడలోని 4 సవర్ల బంగారు చైన్‌ను అదే దుండగులు లాక్కెళ్లారు. ఈ ఘటనలో సుగుణ కింద పడడంతో గాయాలు అయ్యాయి. మహిళల వద్ద వాహనాలు టర్న్ తీసుకుంటున్నట్లు నటించి స్నాచింగ్‌లకు పాల్పడ్డారు. ఒక వ్యక్తి హెల్మెట్ పెట్టుకోగా, రెండవ వ్యక్తి ముఖానికి మాస్క్ పెట్టుకున్నాడు. స్నాచర్లు బైపాస్‌రోడ్డు ఎక్కి పోలీసులు బందోబస్తు నిర్వహిస్తున్న ప్రాంతం నుంచి పరారయ్యారు.

పంటల బీమా నమోదు గడువు 31

నరసరావుపేట: జిల్లాలోని రైతులు 2024–25 రబీ సీజన్ నుంచి వరి పంటకు ఎకరాకు రూ.620లు చెల్లించి పంటల బీమా పథకంలో నమోదు కావాలని కలెక్టర్ పి.అరుణ్‌బాబు సూచించారు. మంగళవారం కలెక్టరేట్‌లో పంటల బీమా పథకంపై జిల్లా స్థాయి మానిటరింగ్ కమిటీ(డీఎల్‌సీ) సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ పంట రుణం తీసుకున్న రైతులు నోటిఫై చేసిన వరి పంటకు ప్రీమియం చెల్లించేందుకు సమ్మతించని పక్షంలో ఈనెల 31కి వారం రోజుల ముందు సంబంధిత బ్యాంకుకు ధ్రువీకరణ పత్రం అందించాలని చెప్పారు. ప్రీమియం చెల్లించేవారు 31లోపు జమ చేయాలని సూచించారు. ఈ మేరకు రైతులకు గ్రామస్థాయిలో విస్తృతమైన అవగాహన సదస్సులు నిర్వహించాలని సభ్యులు, ఫ్యూచర్ జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీ ప్రతినిధులను కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలో రబీ సీజన్‌లో ఇప్పటివరకు ఆరు వేల హెక్టార్లలో వరి పంట సాగైందని, నిర్ణీత గడువులోగా ఈనెల 31లోగా రైతులను అప్రమత్తం చేసి నిర్ణీత ప్రీమియం చెల్లించి బీమా పథక ప్రయోజనం పొందేలా చూడాలని కోరారు. 2019 నుంచి 2023–24 వరకు జిల్లాలో మొక్కజొన్న 8,796 హెక్టార్లు, శనగపంట 12,908 హెక్టార్ల విస్తీర్ణంలో సాగుచేశారన్నారు. గ్రామస్థాయిలో రైతులకు ప్రయోజనం కలిగించేందుకు ప్రధానమంత్రి ఫసల్ బీమా పథకం ద్వారా మొక్కజొన్న, శనగ పంటలను రబీ సీజన్‌లో నోటిఫై చేసేందుకు గుంటూరు డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్‌కు నివేదిక అందజేయాలని ఆదేశించారు. జిల్లా వ్యవసాయాధికారి ఐ.మురళి, ఎల్‌డీఎం శ్రీరామప్రసాదు, డీఈఎస్‌వో జి.శ్రీనివాస్, డీహెచ్‌వో సీహెచ్.రమణారెడ్డి, ఎన్ఎస్పీ ఏఇ ఎస్.మణిదీప్, ఇన్సూరెన్స్ కంపెనీ ప్రతినిధి ఎస్.బి.పంత్, సీఎస్‌సీ మేనేజర్ సైదావలి పాల్గొన్నారు.



డీఎల్‌సీ సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

జిల్లా అభివృద్ధి కోసం అవకాశాలను అన్వేషిద్దాం

స్వర్ణాంధ్ర విజన్–2047 లక్ష్యాలకు అనుగుణంగా జిల్లా అభివృద్ధికి అవకాశాలను శాఖల వారీగా అన్వేషించాలని కలెక్టర్ పి.అరుణ్‌బాబు అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో మంగళవారం విజన్ 2047–పై సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ పారిశ్రామిక, పర్యాటకం, ఫార్మా, ఐటీ రంగాల్లో పెట్టుబడుల ఆకర్షణకు ఉన్న అవకాశాలపై దృష్టిసారించాలని సూచించారు. నాగార్జునసాగర్, కోటప్పకొండ, కొండవీడు కోట, అమరావతి వంటి పర్యాటక ప్రాంతాలను కలుపుతూ టూరిజం ప్యాకేజీలకు రూపకల్పన చేయాలని సూచించారు. ఈ ప్రాంతాల్లో హోటల్ రంగం విస్తరణకు కృషి చేయాలన్నారు. వ్యవసాయం, పాల దిగుబడిపైనా సమీక్షించారు. వాట్సాప్ గవర్నెన్స్‌కు శ్రీకారం చుట్టేందుకు అధికారులు సిద్ధం కావాలన్నారు. గ్రామ వార్డు సచివాలయాల రేషనలైజేషన్‌పై సిబ్బందికి సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ సూరజ్ గనోరే, డీఆర్వో ఏ.మురళి, జిల్లా అటవీ అధికారి కృష్ణప్రియ, సీపీవో జి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సాగునీటి సమాచారం



తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల) : కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద మంగళవారం 1902 క్యూసెక్కులు విడుదల చేశారు. బ్యాంక్ కెనాల్‌కు 120, తూర్పు కెనాల్‌కు 63, పశ్చిమ కెనాల్‌కు 54, నిజాంపట్నం కాలువకు 146, కొమ్మమూరు కాలువకు 1245 క్యూసెక్కులు విడుదల చేశారు.

క్లుప్తంగా

పరిశ్రమల ఏర్పాటుకు వచ్చిన 258 దరఖాస్తులు ఆమోదం

కలెక్టర్ అరుణ్‌బాబు

నరసరావుపేట: జిల్లా పారిశ్రామిక వృద్ధికి కృషి చేయాలని కలెక్టర్ పి.అరుణ్‌బాబు అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన జిల్లా పరిశ్రమల ఎగుమతి కమిటీ సమావేశానికి జిల్లా పరిశ్రమల శాఖ అధికారి ఎం.సుధాకర్, పారిశ్రామికవేత్తలు, వివిధశాఖల అధికారులు హాజరయ్యారు. కలెక్టర్ మాట్లాడుతూ కొత్తగా పరిశ్రమల ఏర్పాటుకు వచ్చిన 278 దరఖాస్తుల్లో 258 ఆమోదించామని వివరించారు. కార్పొరేట్ రెస్పాన్సిబిలిటీలో భాగంగా జిల్లా అభివృద్ధికి సహకరించాలని పారిశ్రామికవేత్తలను కోరారు. సిమెంట్, ఐటీసీ తదితర భారీ పరిశ్రమల ప్రతినిధులు తమ వంతు సాయం చేస్తామని కలెక్టర్‌కు హామీ ఇచ్చారు.

డీఏ, ఐఆర్‌ను వెంటనే ప్రకటించాలి

నరసరావుపేట ఈస్ట్: ఉద్యోగ, ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన డీఏ, 30 శాతం మధ్యంతర భృతిని క్రిస్మస్ కానుకగా రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ప్రకటించాలని ఎస్టీయూ పల్నాడు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి ఎల్.వి.రామిరెడ్డి, యు.చంద్రజిత్‌యాదవ్ డిమాండ్ చేశారు. ఎస్టీయూ భవన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన ముఖ్య నేతల సమావేశంలో వారు మాట్లాడుతూ ఎన్నికల హామీలో భాగంగా కూటమి నేతలు ప్రకటించినట్టు ప్రభుత్వ ఉద్యోగులందరికీ పెండింగ్‌లో ఉన్న డీఏ, ఐఆర్‌ను ప్రకటించాలన్నారు. 12వ పీఆర్సీ కమిషన్‌ను ఏర్పాటు చేసి నిర్దీత కాలవ్యవధిలో నివేదిక తీసుకొని వీలైనంత త్వరగా 12వ పీఆర్సీని అమలు చేయాలని తెలిపారు. పెరిగిన ధరలకు అనుగుణంగా డీఏ ప్రకటించి ఉద్యోగుల మన్ననలు పొందాలన్నారు.

పోలీసుల పేరుతో దోపిడీ

వినుకొండ: పోలీసుల పేరు చెప్పి సుబాబుల్ వ్యాపారి వద్ద రూ. 3 లక్షలు నగదు కాజేసిన ఘటన వినుకొండలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. తెలంగాణ రాష్ట్రం ఖమ్మం జిల్లా మదిరకు చెందిన వెంకటనర్సయ్య సుబాబుల్ వ్యాపారం చేస్తుంటాడు. వినుకొండ ప్రాంతంలో సుబాబుల్ వ్యాపారం చేసేందుకు ఏనుగోపాలెం రోడ్డులో ఓ లాడ్జిలో దిగాడు. తమ వద్ద సుబాబుల్ తోటలు ఉన్నాయని, కొనుగోలు చేసేందుకు రావాలని ఒక వ్యక్తి నమ్మబలికి ఏనుగుపాలెం రోడ్డులోకి నర్సయ్యను తీసుకెళ్లారు. మార్గమధ్యలో మార్కెట్ యార్డు దాటిన తరువాత మరికొంత మంది వ్యక్తులు పోలీసులమని చెప్పి నర్సయ్య వద్ద ఉన్న రూ.3 లక్షలు ఎత్తుకెళ్లారు. ఘటనపై బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎంబీటీఎస్‌లో క్రీడా పోటీలు ప్రారంభం

గుంటూరు రూరల్: నల్లపాడులోని ఎంబీటీఎస్ గవర్నమెంట్ పాలిటెక్నిక్ కళాశాలలో ఐపీఎస్‌జీఎం 2024 పేరుతో ఏర్పాటు చేసిన క్రీడాపోటీలు మంగళవారం ప్రారంభమయ్యాయి. కార్యక్రమాన్ని సీఐడీ డీఎస్పీ గోలి లక్ష్మయ్య, జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి పి.నరసింహారెడ్డి, చలపతి మెటల్ ఇండస్ట్రీస్ డైరెక్టర్ పి. వెంకటేశ్వరరావులు బెలూన్‌లు ఎగురవేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జీవితంలో ఉన్నత స్థానాలకు ఎదగాలంటే విద్యతోపాటు క్రీడలు ఎంతో అవసరమని తెలిపారు. క్రీడలు నిర్వహిస్తున్న సాంకేతిక విద్యా శాఖ డైరెక్టర్ గణేష్‌కుమార్‌కి ప్రిన్సిపల్ టి.శేఖర్ ధన్యవాదాలు తెలిపారు. జిల్లా రీజినల్ స్పోర్ట్స్‌కు జిల్లా వ్యాప్తంగా 19 ప్రభుత్వ, ప్రైవేటు పాలిటెక్నిక్ కళాశాలల నుంచి 418 మంది నమోదు చేసుకున్నట్లు చెప్పారు. విజేతలకు బుధవారం బహుమతులు ప్రదానోత్సవం ఉంటుందని తెలిపారు.

ఫీల్డ్ అసిస్టెంట్లకు కూటమి వేధింపులు

- నగరం మండలంలో ఏడుగురు తొలగింపు
- నియోజకవర్గంలో 17 మంది ఇంటికి



రేపల్లె రూరల్: కూటమి ప్రభుత్వ వేధింపుల పర్వం రోజురోజుకు పెరిగిపోతుంది. అక్రమార్జనకు అడ్డుగా ఉన్న ఎన్ఆర్ఈఎస్ ఫీల్డ్ అసిస్టెంట్లను తొలగించి వేధింపులకు గురిచేస్తుంది. అక్రమార్జనకు సహకరించడం లేదని కొందరిని, గత ప్రభుత్వానికి అనుకూలంగా ఉన్నారని మరికొందరిని ఉద్యోగాల నుంచి తొలగిస్తున్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా ఇప్పటి వరకు 17 మంది ఎన్ఆర్ఈజీఎస్ ఫీల్డ్ అసిస్టెంట్లను తొలగించారు. నగరం మండలంలో అత్యధికంగా ఏడుగురిని, రేపల్లెలో ఐదుగురిని, నిజాంపట్నంలో ముగ్గురిని, చెరుకుపల్లిలో ఇద్దరిని తొలగించి ఉపాధి అవకాశాలను దెబ్బ కొట్టారు.

పోలీసుల ద్వారా వేధింపులు

రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ అండదండలతో ద్వితీయశ్రేణి నాయకుల ఆగడాలు పెరిగిపోతున్నాయి. ముఖ్యంగా నగరం మండలంలో పోలీసులను అడ్డుపెట్టుకుని తమకు అనుకూలంగా లేని ఉద్యోగులను వేధింపులకు గురిచేస్తున్నారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో నకిలీ జాబ్‌కార్డులను సృష్టించి పనిదినాలు చేయకుండా చేసినట్లు మస్టర్‌లో చూపిస్తూ లక్షల్లో నగదు స్వాహా చేస్తున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈ తంతుకు సహకరించని నగరం మండలంలోని ఏడుగురు ఫీల్డ్ అసిస్టెంట్‌లను తొలగించాలని కూటమి నేతలు పట్టుబట్టడంతో వారిని ఆరు నెలల కిందట అధికారులు తొలగించారు. తామేమి తప్పులు చేయలేదంటూ అక్రమంగా తొలగించారంటూ ఫీల్డు అసిస్టెంట్‌లు కోర్టును ఆశ్రయించారు. వారిని తిరిగి విధుల్లోకి తీసుకోవాలని న్యాయస్థానం ఆదేశాలు జారీ చేసింది. పచ్చనేతల ఒత్తిడికి తలొగ్గిన అధికారులు ఏడుగురు ఫీల్డు అసిస్టెంట్‌లను విధుల్లోకి తీసుకోకపోగా అక్రమ చర్యలను బనాయిస్తూ భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. మంత్రి అనగాని సత్యప్రసాద్‌కు గతంలో పీఏగా పనిచేసిన ఓ వ్యక్తి మండల అధికారులు, పోలీసులను అడ్డుపెట్టుకుని అక్రమ కేసులు బనాయిస్తూ వేధింపులకు గురిచేస్తున్నారు. పచ్చపార్టీ నాయకుల ఒత్తిళ్లకు తలొగ్గిన పోలీసులు పగలు రాత్రి తేడా లేకుండా ఫీల్డు అసిస్టెంట్‌లను స్టేషన్‌కు పిలిపించి విచారణ పేరుతో వేధింపులకు గురిచేస్తున్నారు.

నాయకుల ఒత్తిడితో ముందుగానే తనిఖీలు

సంవత్సరంలో జరిగిన పనులకు సంబంధించి సామాజిక తనిఖీలు ప్రతి ఏడాది ఫిబ్రవరి, మార్చి నెలలో నిర్వహించాల్సి ఉండగా స్థానిక నాయకులు జిల్లా అధికారులపై ఒత్తిడి తీసుకువచ్చి డిసెంబర్ నెలలో నిర్వహించేలా ఏర్పాట్లు చేశారు. సామాజిక తనిఖీలకు రికార్డులు అవసరం కావటంతో విధుల నుంచి తొలగింపునకు గురైన ఏడుగురు ఫీల్డు అసిస్టెంట్‌లను పిలిచి రికార్డులు ఇవ్వాలంటూ వేధింపులకు గురిచేస్తున్నారు. తమ వద్ద రికార్డులు లేవని చెబుతుండటంతో పోలీసులను అడ్డుపెట్టుకుని విచారణ పేరుతో ఇబ్బందులకు గురిచేస్తున్నారు. కోర్టు ఆదేశాలను బేఖాతరు చేస్తూ మండలస్థాయి అధికారులు నాయకులకు ఒత్తాసు పలకటంతో ప్రజలు, ప్రజాసంఘాలు పెదవి విరుస్తున్నాయి.

సోషల్‌మీడియా యాక్టివిస్టు సోదరుడిపై దాడి

ఎమ్మెల్యే యరపతినేని అనుచరుడి నిర్వాకం



ఇర్లా శ్రీనివాసరావు

నర్సరావుపేట: పిడుగురాళ్లకు చెందిన సోషల్ మీడియా యాక్టివిస్టు సోదరుడిపై గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు అనుచరుడు ఇంతియాజ్ మంగళవారం రాత్రి దాడి చేసి గాయపరిచాడు. బాధితుడి కథనం ప్రకారం.. పిడుగురాళ్ల పట్టణానికి చెందిన సోషల్ మీడియా యాక్టివిస్టు ఇర్లా శివ తమ్ముడు శ్రీనివాసరావు తన పెళ్లి రోజు సందర్భంగా కేక్ తీసుకొచ్చేందుకు బైక్‌పై వెళ్తుండగా ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు అనుచరుడు ఇంతియాజ్ అడ్డుకుని ''ప్రతిపక్షం వాళ్లు ఎలా బైక్‌పై తిరుగుతారురా'' అంటూ దాడి చేశాడు. చెవిపై బలంగా కొట్టాడు. దీంతో శ్రీనివాసరావు కేసు పెట్టేందుకు పట్టణ పోలీస్‌స్టేషన్‌కు వెళితే పోలీసులు కేసు నమోదుకు నిరాకరించారు. శ్రీనివాసరావు పోలీస్ స్టేషన్‌లో ఉండగానే ఇంతియాజ్ వచ్చి చంపుతానంటూ బెదిరించాడు. ఈ విషయాలను వివరిస్తూ శ్రీనివాసరావు సోషల్‌మీడియాలో వీడియో పోస్టు చేశాడు. ఇది వైరల్ అవుతోంది. దీనిపై పిడుగురాళ్ల సీఐ శ్రీరాం వెంకట్రావును వివరణ కోరగా తన దృష్టికి రాలేదని, ఫిర్యాదు ఇస్తే తీసుకుంటామని వివరించారు.

విద్యార్థులు క్రీడా స్ఫూర్తి అలవర్చుకోవాలి

వర్సిటీ మహిళా ఖోఖో టోర్నీ ప్రారంభం



ఖోఖో టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న కళాశాల కార్యదర్శి సుబ్బారెడ్డి, డైరెక్టర్ మైనేడి

నరసరావుపేట ఈస్ట్: విద్యార్థి దశలో క్రీడా స్ఫూర్తి అలవర్చుకోవటం ద్వారా జీవితంలో ఉన్నతంగా ఎదగవచ్చని విక్టరీ డిగ్రీ కళాశాల కార్యదర్శి ఒద్దుల సుబ్బారెడ్డి, డైరెక్టర్ మైనేడి శ్రీనివాసరావు తెలిపారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం అంతర్ కళాశాలల మహిళా ఖోఖో పోటీలను మంగళవారం కళాశాల క్రీడా మైదానంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా సుబ్బారావు, శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యార్థినులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలన్నారు. ఆటలతోపాటు ఉద్యోగ, ఉపాధి అవకాశాలను పొందవచ్చన్నారు. మహిళలు అన్ని రంగాలలో ప్రగతి సాధించాలని ఆకాంక్షించారు. వర్సిటీ పరిధిలోని 9 కళాశాలల నుంచి ఖోఖో జట్లు పోటీల్లో పాల్గొన్నాయి. కార్యక్రమంలో వర్సిటీ టోర్నమెంట్ పరిశీలకుడు డాక్టర్ పి.శివప్రసాదు, సెలక్షన్ కమిటీ సభ్యులు డాక్టర్ ఎ.అరుణసుజాత, జి.బాలశంకరరెడ్డి, కళాశాల ప్రిన్సిపల్ పి.వేణుగోపాల్, పీడీ ఎస్.కృష్ణంరాజు పాల్గొన్నారు.

విద్యుత్ చార్జీల భారం తగ్గించాలి

– సీపీఎం జిల్లా కార్యదర్శి నేతాజీ

కొరిటిపాడు (గుంటూరు): కరెంటు చార్జీలు తగ్గిస్తామని ఎన్నికల్లో కూటమి హామీ ఇచ్చిందని, అధికారంలోకి వచ్చాక ఆ మేరకు కట్టుబడి ప్రజలపై విద్యుత్తు చార్జీల భారం తగ్గించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వై.నేతాజీ డిమాండ్ చేశారు. ప్రజలపై భారం మోపే ప్రీ పెయిడ్ స్మార్ట్ మీటర్లు, విద్యుత్ సర్దుబాటు చార్జీలను నిరసిస్తూ సీపీఎం ఆధ్వర్యంలో పొన్నూరు రోడ్‌లోని విద్యుత్ శాఖ ఎస్ఈ కార్యాలయం ఎదుట మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నేతాజీ మాట్లాడుతూ... సర్దుబాటు చార్జీల పేరుతో, స్మార్ట్ మీటర్లు పెడతామంటూ ప్రజలపై భారం వేశారని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం ఆరు నెలల్లోనే రూ.15,486 కోట్ల భారం వేయడం అమానుషమని మండిపడ్డారు. పార్టీ నగర కార్యదర్శి కె.నళినీకాంత్ మాట్లాడుతూ.. స్మార్ట్ మీటర్ల మార్పు వినియోగదారులకు తీవ్ర నష్టమన్నారు. దీనికోసం నెలకు రూ.100 నుంచి రూ.150 వరకు వాయిదాల పద్ధతిలో మొత్తం రూ.10 వేలు నుంచి రూ.15 వేల వరకు వసూలు చేస్తారని ఆరోపించారు. పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు పాశం రామారావు మాట్లాడుతూ విద్యుత్ రంగాన్ని ముక్కలు చేసి ప్రైవేటు వ్యక్తులకు ఇప్పటికే అప్పగించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. ఎస్సీ, ఎస్టీ, వృత్తిదారులు, వ్యవసాయానికి రాయితీలు క్రమంగా తొలగించనున్నట్లు ఆరోపించారు. డిమాండ్లపై విద్యుత్ శాఖ సీనియర్ అసిస్టెంట్ పాశం రామిరెడ్డికి వినతిపత్రం అందజేశారు.

ఆర్టీసీ అధికారుల తీరు ఆక్షేపణీయం



లక్ష్మీపురం (గుంటూరు వెస్ట్): ఏపీఎస్ ఆర్టీసీ ఉద్యోగులను ఉద్యమాల వైపు అధికారులే బలవంతంగా నెడుతున్నారని ఆర్టీసీ ఈయూ రాష్ట్ర అధ్యక్షుడు పలిశెట్టి దామోదరరావు అన్నారు. గుంటూరులోని కొత్తపేటలో ఉన్న జిల్లా సీపీఐ కార్యాలయం మల్లయ్య లింగంభవన్‌లో మంగళవారం ఈయూ జిల్లా స్థాయి విస్తృత కౌన్సిల్ సమావేశం జిల్లా అధ్యక్షుడు షేక్ కరీముల్లా అధ్యక్షతన జరిగింది. ఇందులో దామోదరరావు మాట్లాడుతూ.. ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. నెల్లూరు జోనల్ కార్యదర్శి దాసరి బాబూ శామ్యుల్, జిల్లా కార్యదర్శి ఇ.విజయ్ కుమార్, స్టేట్ మెయింటినెన్సు కమిటీ మెంబర్ ధనుంజయరెడ్డి, నాయకులు డి.వి.స్వామి, ఎ.పి.రావు, ఖాసీం తదితరులు పాల్గొన్నారు.

వివాహితపై లైంగికదాడికి యత్నం

కొల్లూరు: వివాహితపై ఓ వ్యక్తి లైంగికదాడికి యత్నించిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం మేరకు.. కొల్లూరుకు చెందిన ఓ మహిళ తన భర్తతో కలసి జీవనం సాగిస్తుంది. ఆదివారం రాత్రి కోన బాజి అనే వ్యక్తి మహిళ భర్తతో కలసి మద్యం సేవించాడు. అతిగా మద్యం తాగిన మహిళ భర్తను ఇంటి వద్ద దిగబెట్టేందుకు వెళ్లిన బాజీ వారి ఇంటిలోనే నిద్రకు ఉపక్రమించాడు. ఆమె తన భర్తతో కలసి వేరే గదిలో నిద్రిస్తుండగా అర్ధరాత్రి సమయంలో తలుపులు కొట్టి నిద్ర లేపిన బాజీ తనకు మంచినీరు కావాలని కోరాడు. ఆమె మంచినీరు అందించింది. అనంతరం మూత్ర విసర్జనకు బయటకు వెళ్లి వచ్చిన నిందితుడు ఆమెను గట్టిగా పట్టుకొని లైంగికదాడికి యత్నించాడు. ఆమె పెద్దగా కేకలు వేయడంతో భర్త నిద్ర నుంచి లేవడంతోపాటు, చుట్టుపక్కల వారు అక్కడకి చేరుకున్నారు. ఇది గమనించిన నిందితుడు అక్కడ నుంచి పరారయ్యాడు. వెంటనే స్థానికులు 100 నంబర్‌కు ఫోన్ చేసి సమాచారం అందించడంతో పోలీసులు అక్కడకి చేరుకొని వివరాలు సేకరించారు. సోమవారం ఉదయం జమ్మిచెట్టు ప్రాంతంలో ఉన్న నిందితుడ్ని బాధితురాలి తరఫు బంధువులు, వారికి పరిచయం ఉన్న వ్యక్తులు మూకుమ్మడి దాడి చేసి దేహశుద్ధి చేశారు. వారి నుంచి తప్పించుకున్న బాజీ రక్షణ కోసం పోలీసుస్టేషన్‌కు వెళ్లాడు. అనంతరం పోలీసుస్టేషన్‌కు చేరుకున్న బాధితురాలి బంధువులు విషయం పోలీసులకు వివరించారు.

రాజీ ప్రయత్నాలు విఫలం

కూటమి ప్రభుత్వంలోని ఓ రాజకీయపార్టీ నేత కేసులు వద్దని ఇరు పక్షాలు రాజీ పడతారని చెప్పడంతో తొలుత పోలీసులు కేసులు నమోదు చేయకుండా పంపించి వేశారు. చికిత్స కోసం నిందితుడు తెనాలి ప్రభుత్వ వైద్యశాలలో చేరాడు. దీనితో పోలీసులు సోమవారం అర్ధరాత్రి బాజీపై కేసు నమోదు చేశారు. దాడి చేసిన బాధిత మహిళ తల్లి తిరుపతమ్మ, నరేష్‌పైనా కేసు నమోదు చేశారు.

సాయి శరణ్య జనరల్ స్టోర్స్‌లో అగ్నిప్రమాదం

- రూ.40 లక్షలకుపైగా ఆస్తి నష్టం వాటిల్లినట్లు అంచనా
- విద్యుత్ షార్ట్ సర్క్యూటే ప్రమాదానికి కారణం
- లబోదిబోమంటున్న దుకాణదారుడి కుటుంబం



మంటల్లో సాయి శరణ్య జనరల్ స్టోర్

సత్తెనపల్లి: విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం జరిగిన ఘటన సత్తెనపల్లి 24వ వార్డులోని సాయి శరణ్య జనరల్ స్టోర్స్‌లో సోమవారం అర్ధరాత్రి జరిగింది. పట్టణానికి చెందిన ఆర్యవైశ్యుడు అన్నం వేణు ఎంతో కాలంగా సాయి శరణ్య జనరల్ స్టోర్స్ నిర్వహిస్తున్నారు. సుమారు రూ.40 లక్షల నుంచి రూ. 50 లక్షల విలువ చేసే సామగ్రి స్టోర్‌లో నిల్వ చేశారు. సోమవారం అర్ధరాత్రి విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కావడంతో మంటలు అంటుకొని దుకాణం మొత్తం పూర్తిగా దగ్ధమైంది. స్థానికులు ఇచ్చిన సమాచారంతో అగ్నిమాపక శాఖ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని మంటలు ఆర్పేందుకు శతవిధాలా యత్నించినా ఫలితం లేకపోయింది. సామగ్రి బుగ్గి అయింది. పట్టణ ఎస్ఐ ఎం.సంధ్యారాణి దుకాణాన్ని పరిశీలించి ప్రమాదంపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. పెద్ద మొత్తంలో ప్లాస్టిక్ వస్తువులు నిల్వ ఉండడంతో ఎవరైనా ఉద్దేశపూర్వకంగా చేశారా? లేక ప్రమాదవశాత్తు జరిగిందా? అనే దానిపై పట్టణ పోలీసులు విచారణ సాగిస్తున్నారు. స్టోర్స్ నిర్వాహకుడు అన్నం వేణు కుటుంబం లబోదిబోమంటుంది. కనీసం ఇన్సూరెన్సు కూడా లేకపోవడంతో నష్టం ఎలా భరించాలో తెలీక ఆందోళన చెందుతోంది.

ముగ్గురు గంజాయి విక్రేతలు అరెస్టు



రాజుపాలెం పోలీసు స్టేషన్‌లో విలేకర్లతో మాట్లాడుతున్న డీఎస్పీ, సీఐ, ఎస్ఐ, సిబ్బంది

రాజుపాలెం: గంజాయి అమ్ముతున్న ఒక మహిళను, ఇద్దరు యువకులను సోమవారం అరెస్టు చేసినట్లు సత్తెనపల్లి డీఎస్పీ ఎం.హనుమంతరావు తెలిపారు. మంగళవారం స్థానిక పోలీసు స్టేషన్‌లో డీఎస్పీ విలేకరుల సమావేశం నిర్వహించి కేసు వివరాలు వెల్లడించారు. ఆయన కథనం ప్రకారం.. చౌటపాపాయపాలెం గ్రామానికి చెందిన కుందురు దుర్గారావు, క్రోసూరు మండలం పారుపల్లి గ్రామానికి చెందిన పారుపల్లి భూలక్ష్మి, చౌటపాపాయపాలెం గ్రామానికి చెందిన వల్లాల ప్రసాద్ గంజాయి అమ్ముతున్నారనే సమాచారంతో సత్తెనపల్లి రూరల్ సీఐ ఎంవీ సుబ్బారావు, ఎస్ఐ కె.వేణుగోపాల్ తన సిబ్బందితో దుర్గారావు ఇంటిపై దాడిచేసి ముగ్గురినీ అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి 2 కిలోల గంజాయి, 2 సెల్‌ఫోన్లు, రూ.3,100 నగదు స్వాధీనం చేసుకున్నారు. కొంత కాలం నుంచి దుర్గారావు నర్సీపట్నం మండలం చింతపల్లి గ్రామాల పరిసరప్రాంతాల నుంచి గంజాయి తీసుకొచ్చి తన ఇంటి వద్ద ఉంచుతున్నాడని, దీనిని నిందితులు ముగ్గురూ అమ్ముతున్నారని డీఎస్పీ తెలిపారు. వీరిని కోర్టులో హాజరు పరచగా రిమాండ్ విధించినట్లు ఎస్ఐ తెలిపారు.

మిర్చి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

ఏపీ రైతు సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి గోపాలరావు



నరసరావుపేట: మిర్చి రైతులను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని ఏపీ రైతు సంఘం పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి ఏపూరి గోపాలరావు డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక కోటప్పకొండ రోడ్డులోని సంఘ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ధరల పతనం వల్ల మిర్చి రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మిర్చి యార్డులో ఎగుమతిదారులు, కమీషన్ వ్యాపారులు కూడబలుక్కుని ధర పెరగకుండా చూస్తున్నారని, ప్రభుత్వం జోక్యం చేసుకుని రైతులకు న్యాయం చేయాలని కోరారు.

నగదు తిరిగివ్వలేదని యువకుడి దారుణ హత్య



దీపక్ మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్‌హెచ్‌వో వీరసోమయ్య

పట్నంబజారు: నగదు తిరిగి ఇవ్వలేదని ఓ యువకుడిని కొందరు కొట్టి చంపిన ఘటన గుంటూరు నగరంలో చోటు చేసుకుంది. పాత గుంటూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తెనాలిలోని చెంచుపేటలో నివాసం ఉండే చప్పిడి దీపక్ (27)కు గద్దల కిరణ్ స్నేహితుడు. ఇద్దరూ మద్యం తాగి తిరుగుతుండేవారు. కిరణ్ కొద్ది కాలం క్రితం గుంటూరుకు వచ్చి ఎస్వీఎన్ కాలనీలో నివాసం ఉంటున్నాడు. ఏప్రిల్‌లో తెనాలిలో దీపక్, కిరణ్ మద్యం తాగారు. కిరణ్ మత్తులో ఉండగా అతడి ఫోన్ నుంచి దీపక్ రూ. 53 వేలు తన ఖాతాకు బదిలీ చేసుకున్నాడు. దీనిపై ఇద్దరూ గొడవ పడ్డారు. దీపక్ తండ్రి చంద్రశేఖరరావు దఫాలుగా ఆ మొత్తం తిరిగి ఇస్తానని చెప్పాడు. కానీ ఇవ్వకపోవటంతో దీపక్‌ను భయపెట్టి డబ్బులు తీసుకోవాలని కిరణ్ నిర్ణయించుకున్నాడు. నాలుగు రోజులుగా తెనాలి వెళుతూ దీపక్‌తో కలిసి మద్యం తాగుతూ మంచి చేసుకున్నాడు. ఈ నెల 16వ తేదీన రాత్రి కూడా మద్యం తాగించి, గుంటూరులో ఇంత కంటే మంచి పార్టీ ఉందని నమ్మబలికి తీసుకొచ్చాడు. పాతగుంటూరు బాలాజీనగర్ సమీపంలోని రాజీవ్ గృహకల్ప సముదాయం సమీపంలోని ఖాళీ స్థలంలోకి చేరుకున్నారు. అప్పటికే గుంటూరులో కిరణ్ స్నేహితులైన రవి, అక్బర్, అశోక్, గోపిలతో కలిసి పక్కా ప్లాన్ సిద్ధం చేశాడు. డబ్బులు ఇవ్వకుంటే హతమార్చాలనే నిర్ణయంతో వారు ఉన్నారు. ఈ క్రమంలో కర్రలతో దీపక్‌ను ఇష్టానుసారం కొట్టి ఓ ఆటో మాట్లాడి గుంటూరు ప్రభుత్వాసుపత్రికి పంపారు. అతడి పేరు వెంకటరెడ్డి అని ఆటోవాలాకు చెప్పారు. ఏ ఒక్కరూ ఆసుపత్రి దగ్గరకు రాలేదు. దీంతో రాత్రి 2 గంటల సమయంలో ఆటో డ్రైవరు ఆసుపత్రిలో దీపక్‌ను చేర్చి వెళ్లిపోయాడు. తీవ్ర గాయాలకు చికిత్స పొందుతూ దీపక్ తెల్లవారుజామున నాలుగు గంటల సమయంలో మృతి చెందాడు. జీజీహెచ్‌లోని అవుట్ పోస్ట్ నుంచి సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు. పాత గుంటూరు పోలీసుస్టేషన్ ఎస్‌హెచ్‌వో వై. వీరసోమయ్య మృతదేహాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఇప్పటికే నిందితులు పోలీసులు అదుపులో ఉన్నట్లు తెలిసింది. దీపక్ సోదరుడు తరుణ్ కూడా కొద్ది సంవత్సరాల క్రితం తెనాలిలో హత్యకు గురైనట్లు పోలీసులు తెలిపారు.

23 బార్ అండ్ రెస్టారెంట్‌ల నిర్వహణకు నోటిఫికేషన్

నెహ్రూనగర్: ఉమ్మడి గుంటూరులో జిల్లాలో 23 బార్ అండ్ రెస్టారెంట్‌లు, ప్రీమియం లిక్కర్ స్టోర్ నిర్వహణకు ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసింది. గత ప్రభుత్వంలో హయాంలో మూడేళ్ల కాలపరిమితి (2022–25) బార్ అండ్ రెస్టారెంట్ నిర్వహించుకునేందుకు టెండర్ ప్రక్రియ నిర్వహించిన విషయం తెలిసిందే. వాటిలో కొన్ని బార్ అండ్ రెస్టారెంట్ నిర్వాహకులు ప్రతి సంవత్సరం లైసెన్స్ రెన్యూవల్ చేసుకోకపోవడంతో ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలో 23 బార్ అండ్ రెస్టారెంట్లు మిగిలిపోయాయి. అందులో మంగళగిరి తాడేపల్లి మున్సిపాలిటీ పరిధిలో 1, తెనాలిలో 5, పొన్నూరు 2, రేపల్లె 1, పిడుగురాళ్ల 6, మాచర్ల 3, గురజాల 2, దాచేపల్లి 3 ఉన్నాయి. వీటి నిర్వహణకు వచ్చే ఏడాది ఆగస్టు 31వ తేదీ వరకు కాలపరిమితితో ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ నెల 22వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. 23న నిర్దేశిత ఫీజు చెల్లించాలి. 24న ఆన్‌లైన్‌లోనే ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు బిడ్డింగ్‌లో పాల్గొనాలి.